యోగా మాస్టరు రాఘవేంద్ర రాజును సన్మానిస్తున్న పోలీస్ సిబ్బంది

ఒత్తిడి తగ్గించేందుకే యోగా

ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పోలీస్ సిబ్బంది తమ విధి నిర్వహణలో ఎంతో ఒత్తిడికి గురవుతుంటారని, దానిని తగ్గించడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ పేర్కొన్నారు. ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లాలోని పిఎస్‌ఒ (పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్)లు, స్పెషల్ పార్టీ సిబ్బందికి యోగా, మెడిటేషన్ మాస్టర్ రాఘవేంద్ర రాజు ఆధ్వర్యంలో ట్రెస్ మేనేజ్‌మెంట్ ఒక రోజు అవగాహన శిక్షణ కార్యక్రమం బుధవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. పోలీసులు విధులు నిర్వహిస్తున్న సమయంలో పొందే ఒత్తిడిని తగ్గించుకునే మార్గాలు, ఒత్తిడి వల్ల వచ్చే సమస్యలు, పరిణామాల గురించి ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా తెలుసుకుంటారన్నారు. ఒత్తిడి తగ్గించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి ఈ కార్యక్రమం ద్వారా అవగాహన వస్తుందని తెలియజేశారు. అనంతరం యోగా మాస్టర్ రాఘవేంద్ర రాజు మాట్లాడుతూ.. పోలీసు విధులు ఎంతో కష్టతరమైనవని అన్నారు. నిరంతరం నూతన సవాళ్లు ఎదురవుతూ ఉంటాయన్నారు. విధుల్లో నిరంతరం ఎదురయ్యే సవాళ్లను, ఒత్తిడిని తగ్గించుకుంటూ మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలన్నారు. లేనిపక్షంలో దాని పరిణామాలు మనిషిపై తీవ్రంగా ఉంటాయన్నారు. ఒత్తిడి వల్ల ఎదురయ్యే అనారోగ్య సమస్యలు, మొదలైన వాటి గురించి తెలియజేశారు. మానసిక ఒత్తిడిని ఎలా తగ్గించుకోవాలి, అందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సిబ్బందికి తెలియజేశారు. సిబ్బంది అడిగిన ప్రశ్నలకి సమాధానాలు తెలిపి వారి అనుమానాలను నివృత్తి చేశారు. అనంతరం జిల్లా అదనపు ఎస్పీ కెవి.రామకృష్ణ ప్రసాద్, ఎఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్ యోగా మాస్టర్ రాఘవేంద్ర రాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్యూరిటీ వింగ్ ఆర్‌ఐ నారాయణ, పిఎస్‌ఒలు, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయివేటీకరణ దిశగా ఆర్టీసీ బస్టాండ్లు..?

ప్రయాణికుల సౌకర్యార్థం నడుస్తున్న పలు ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రభుత్వం ప్రయివేటు పరం చేసింది. ప్రస్తుతం రోడ్డు రవాణా సంస్థకు చెందిన ఆస్తులను కూడా ప్రయివేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తోంది. లాభాల బాటలో నడుస్తున్న గుత్తి ఆర్టీసీ బస్టాండ్‌ను అభివృద్ధి చేయాల్సింది పోయి.. అందుకు భిన్నంగా ప్రయివేటు వ్యక్తులకు అప్పగించేందుకు ప్రభుత్వం పూనుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విషయం తెలుసుకున్న లీజుదారులు అయోమయంలో పడ్డారు. తమకు అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు.

గుత్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు

రోడ్డున పడనున్న లీజుదారుల కుటుంబాలు

ప్రభుత్వమే ఆర్టీసీ బస్టాండ్లను అభివృద్ధి పరచాలని డిమాండ్

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్రవ్యాప్తంగా 40 ఆర్టీసీ బస్టాండు లను ప్రభుత్వం ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకు అప్పగించేందుకు చర్యలు ప్రారంభించింది. అనంతపురం జిల్లాలో తాడిపత్రి, గుత్తి, కదిరి ఆర్టీసీ బస్టాండు లను ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పేందుకు శ్రీకారంచుడుతోంది. అందులో భాగంగా గుత్తి ఆర్టీసీ డిపో కార్యాలయంలో బస్టాండు ఆవరణంలోని వాణిజ్య దుకాణదారులు, స్థలం లీజుదారులు, బిల్డర్లతో ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్.ఆంథోనీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేంద్రబాబు, గుత్తి డిపో మేనేజర్ నారాయణస్వామి లు మంగళవారం సమావేశం నిర్వహించారు. బస్టాండును ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పడంపై సమావేశంలో పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు అన్యాయం జరుగుతుందని లీజుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లీజుకివ్వడం ఎంతవరకు సమంజసం..

1976 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం గుత్తిలో ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండు ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించింది. రూ.లక్షలు వెచ్చించి బస్టాండ్ భవనాన్ని నిర్మించారు. 2.99 ఎకరాల విస్తీర్ణంలో బస్టాండు ఉంది. ఇక్కడ 75 వాణిజ్య దుకాణాలు ఉన్నాయి. బస్టాండ్ ఆవరణలోని స్థలాలను కూడా లీజుకు ఇచ్చారు. దుకాణాలు, స్థలాలకు సంబంధించి ఒక్కొక్కరు రూ.4 వేలు నుంచి రూ.80 వేలు వరకు అద్దెలు చెల్లిస్తున్నారు. ప్రతి నెలా ఏపీఎస్ ఆర్టీసీకి గుత్తి బస్టాండ్ వాణిజ్య దుకాణాదారులు, లీజుదారుల నుంచి అద్దెల రూపంలో రూ.7.22 లక్షల ఆదాయం చేకూరుతోంది. అయితే శిథిలమైన బస్టాండ్ భవనం ధ్వంసం చేసి నూతన భవనాన్ని ప్రభుత్వం నిర్మించాల్సి ఉంది. కానీ ఆదిశగా చర్యలు చేపట్టలేదు. ఏకంగా ప్రయివేటు వ్యక్తులకు 33 ఏళ్ల లీజుకు ఆర్టీసీ బస్టాండ్‌ను అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించడం ఎంతవరకు సమంజసమని లీజుదారులు ప్రశ్నిస్తున్నారు.

ప్రయివేటుకు అప్పగించడం అన్యాయం..

టెండర్ ద్వారా స్థలాన్ని లీజు తీసుకుని ఏడు నెలల అద్దె ముందస్తుగా చెల్లించి రూ.6.50 లక్షల వ్యయంతో భవనాన్ని నిర్మించుకున్నాను. సంస్థకు ప్రతి నెలా 18 శాతం జీఎస్టీని కలుపుకుని సక్రమంగా అద్దె చెల్లిస్తూ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ప్రస్తుతం ప్రయివేటు వ్యక్తులకు లీజుకు ఇస్తే తమకు అన్యాయం జరుగుతుంది. ప్రభుత్వమే బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలి – **మహబూబ్ బాషా (టిప్పు), ఆర్టీసీ స్థలం లీజుదారుడు, గుత్తి**

ప్రభుత్వ మార్గదర్శకాలు మాత్రమే..

ప్రభుత్వ మార్గదర్శకాలలో భాగంగా గుత్తి ఆర్టీసీ బస్టాండును అభివృద్ధి చేసేందుకు లీజుదారులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించాం. ప్రజాభిప్రాయాలను సేకరించాం. నివేదికను ప్రభుత్వానికి పంపుతాం. గుత్తి బస్టాండును ప్రయివేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

- నారాయణస్వామి, ఏపీఎస్ ఆర్టీసీ ఇన్‌ఛార్జి డిపో మేనేజర్, గుత్తి.

అయోమయంలో లీజుదారులు..

ఆర్టీసీ బస్టాండుల అభివృద్ధిలో భాగంగా ప్రయివేట్, పబ్లిక్, ప్రాపర్టీ మోడల్ కింద బస్టాండ్ భవనం, కార్యాలయ గదులు, వాణిజ్య దుకాణ సముదాయాలను సివిల్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా ప్రయివేటు వ్యక్తులే నిర్మిస్తారని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత స్థలం లీజుదారులు టెండర్ల ద్వారా లీజు దక్కించుకున్నారు. ఏడు నెలల అద్దెలు ముందస్తుగా చెల్లించారు. ఐదేళ్ల అనంతరం మరో రెండు సంవత్సరాలు రెన్యువల్ లీజు చేసుకునే విధంగా ఆర్టీసీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రస్తుతం గుత్తి ఆర్టీసీ బస్టాండును ప్రయివేటు వ్యక్తులకు అప్పగించనున్నారు. దీంతో అప్పులు చేసి, రూ.లక్షలు వెచ్చించి భవనాలు నిర్మించుకుని వ్యాపారాలు చేస్తూ జీవనం కొనసాగిస్తున్న లీజుదారులు పరిస్థితి అయోమయంలో పడింది. ప్రయివేటు వ్యక్తులకు అప్పగిస్తే వారు మొత్తం దుకాణాలను ధ్వంసం చేస్తారు. లీజుదారుల కుటుంబాలు రోడ్డున పడతాయి. అప్పుడు ఆర్టీసీ సంస్థను కాదని ప్రయివేటు వ్యక్తులను లీజుదారులు ఆశ్రయించాల్సి ఉంటుంది. వారు చెప్పిందే వేదంగా లీజుదారులు నడవాల్సి ఉంటుంది. ప్రయివేటు వ్యక్తులు లక్షలాది రూపాయలు అడ్వాన్సు రూపంలో చెల్లించాలని, వేలాది రూపాయలు అద్దెలు ఇవ్వాలని హుకుం జారీ చేస్తే తాము వ్యాపారాలు ఎలా కొనసాగించేదని లీజుదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గుత్తి ఆర్టీసీ బస్టాండును అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు. ప్రయివేటు వ్యక్తులకు అప్పగిస్తే ప్రస్తుత లీజుదారుల కుటుంబాలు రోడ్డున పడతాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇస్తమా నిర్వహణ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి కదిరి అర్బన్

ఇస్తమాకు హాజరవుతున్న వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని మాజీ ఎమ్మెల్యే అత్తార్‌చాంద్‌బాషా తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఇస్తమా జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు. కదిరి మండల పరిధిలోని కుమ్మర వాండ్ల పల్లి లో మార్చి 3, 4 తేదీల్లో జరిగే ఇస్తమా ప్రదేశంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

అదే విధంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ కూడా ఇస్తామా నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కదిరి ప్రాంతంలో ఇస్తమా జరగడం ఆనందంగా ఉందని అన్నారు. మండల పరిధిలోని కుమ్మర వాండ్ల పల్లి లో మార్చి 3,4 తేదీల్లో జరిగే ఇస్తమా ప్రదేశంలో జరుగుతున్న ఏర్పాట్లను ఈసందర్భంగా ఆయన పరిశీలించారు. ఇస్తమాకు హాజరవుతున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఇస్తమా ప్రదేశంలో జరుగుతున్న ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోల్పోయిన హక్కులను సాధించుకుందాం

బుక్‌లెట్ ను విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఎపిఎస్‌ఆర్టీసీలో విలీనం పేరుతో కోల్పోయిన హక్కులను తిరిగి సాధించుకుందామని ఎస్‌డబ్ల్యూఎఫ్ (స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్) కడప జోనల్ కార్యదర్శి భాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం పుట్టపర్తి లోని ఆర్టీసీ డిపోలో రాష్ట్ర కమిటీ ముద్రించిన ఆర్టీసీ ఉద్యోగులు, విలీనంతో కోల్పోయిన హక్కులు అనే పుస్తకాన్ని భాస్కర్‌తో పాటు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ తదితరులు ఉద్యోగ కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2020 జనవరిలో ఆర్టీసీలో పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇందుకు ప్రత్యేకంగా చట్టం కూడా చేసిందన్నారు. విలీనం అయితే తమ బతుకులు బాగుపడతాయని, పని గంటలు తగ్గుతాయని, వేతనాలు పెరుగుతాయని, ఉద్యోగ భద్రత లభిస్తుందని ఉద్యోగులు భావించారన్నారు. విలీనం తర్వాత కార్మికుల బతుకులు పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లైందన్నారు. మెరుగైన ఆర్థిక పరిస్థితులు కల్పించడానికి, కార్మికులకు మెరుగైన పని పరిస్థితులు కల్పించడానికి, ఉద్యోగ, కార్మిక సంఘాలన్నీ ఏకమై కోల్పోయిన హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోనల్ నాయకులు రియాజుల్లా, యాకుబ్ ఖాన్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిద్దాం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిద్దామని మున్సిపల్ ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం పురపాలక సంఘంలోని ఎంజిఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఇన్‌చార్జి తహశీల్దార్, సిఐతో కలిసి పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌లో ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ సౌజన్య మాట్లాడుతు ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఎన్నికల కోడ్‌ను అమలు చేయాలని అదేశాలు ఇచ్చిందన్నారు. అధికారులు ప్రతి ఒక్కరు ఎన్నికల కోడ్‌ను తప్పని సరిగా అమలు చేయాలన్నారు. దీంతో పాటు పోలీస్ అధికారులు శాంతిభద్రల పరిరక్షణకు సంబందించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఈ సమావేశంలో వన్‌టౌన్ సిఐ ఈరన్న, రూరల్ సిఐ వేణుగోపాల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిధులు ఇక్కడ.. తాళం అక్కడ..!

- ముగిసిన ఆర్థిక సంవత్సరం గడువు
- పెండింగ్‌లో కోట్లాది రూపాయల బిల్లులు
- పనులు చేసి లబోదిబోమంటున్న గుత్తేదారులు

బిల్లులు కాకపోవటంతో గుత్తేదారులు అధికారులకు అప్పగించని తహశీల్దార్ కార్యాలయ భవనం

బిల్లులు అప్‌లోడ్ చేయడంలో నిమగ్నమైన ఇంజనీర్లు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘాల్లో పనులు చేసిన గుత్తేదారులు అప్పుల పాలవుతున్నారు. అభివృద్ధి పనులు చేయడమే వారి పాలిట శాపంగా మారింది. ఖజానాలో నిధులు పుష్కలంగా ఉన్నా...దానికి సంబందించిన తాళం ప్రభుత్వం చేతిలో ఉండడంతో ఆ నిధులను ఉపయోగించుకోవాడానికి మున్సిపల్ అధికారులకు అధికారం లేకుండా పోయింది. ఆన్‌లైన్‌లో బిల్లులు ఎక్కించినా ప్రయోజనం లేకుండా పోతోంది. కోట్లాది రూపాయల పనులు పూర్తి చేసి, దానికి సంబందించిన బిల్లులను సిఎఫ్‌ఎంఎస్‌లోకి ఎక్కించినా ఫలితం లేకుండా పోయింది. హిందూపురం పురపాలక సంఘంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.15కోట్లు, సాధారణ నిధులు నిధులు రూ.4.50కోట్లు మూలుగుతున్న గుత్తేదారులకు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. దీంతో గుత్తేదారులు అప్పుల పాలై పురపాలక సంఘంలో అభివృద్ధి పనులు అంటేనే పరుగెత్తే పరిస్థితి నెలకొంది.

బిల్లుల కోసం కొన్నేళ్లుగా గుత్తేదారులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పూర్తి చేసిన పనులను ఇంజనీరింగ్ అధికారులు ఎం-బుక్లో రికార్డు చేసి, అందుకు సంబంధించిన మొత్తం వారి ఖాతాల్లో వేయడానికి బిల్లులను సిఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ చేస్తారు. నిధులు అందుబాటులో ఉన్నప్పుడు ఆర్థిక శాఖ జమ చేస్తుంది. కానీ పనుల వివరాలు ఆన్ లైన్‌లో నమోదు చేయడంలోను, సిఎఫ్‌ఎంఎస్‌లో ఎక్కించే విధానంలో మార్పులు తీసుకొస్తున్నామని ఐదు నెలల కిందట ప్రభుత్వం ప్రకటించింది. మార్పులు ఏమిటి..? బిల్లులను ఎలా అప్లోడ్ చేయాలి...?. ఎలాంటి చర్యలు చేపట్టాలి...? అనే అంశాలపై అధికారులకు అవగాహన కల్పించలేదు. మరో వైపున ఐదు నెలలుగా గుత్తేదారుల బిల్లులను సిఎస్‌ఎంఎస్‌లో అప్లోడ్ చేసే పాత లాగిన్‌ను నిలిపివేశారు. దీంతో పనులు చేసిన గుత్తేదారులు లబోదిబో మంటున్నారు. హిందూపురం పురపాలక సంఘంలో సాధారణ నిధులకు సంబందించి 111 పనులకు గాను సుమారు రూ.3.13కోట్లకు సంబందించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే పురపాలక సంఘంలో దాదాపు రూ.4.50కోట్లు నిధులు ఉన్నాయి. సాధారణ నిధులకు సంబందించి పనులను చేస్తే చెక్కులు ఇస్తారని గుత్తేదారులు చేశారు. అయితే దీనికి సంబందించిన అధికారం సైతం ఆర్థికశాఖ తన అధీనంలోకి తీసుకోవడంతో ఇవి సైతం పెండింగ్‌లో ఉన్నాయి. ఇక 15వ ఆర్థిక సంఘానికి సంబందించి రూ.15కోట్లు నిధులు వచ్చాయి. దీనికి సంబందించి ఇప్పటికే రూ.2.60కోట్ల పనులకు సిఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. ఇప్పటి వరకు వాటికి సంబందించి ఏలాంటి ఉత్తర్వులు లేదు. హిందూపురం మున్సిపాలిటీలో ఏకంగా రూ.5.50 కోట్ల విలువైన పనుల బిల్లులు సిఎఫ్‌ఎంఎస్‌లో చేర్చినా నిధులు మంజూరు కాక గుత్తేదారులు అల్లాడిపోతున్నారు. మున్సిపాలిటీ చుట్టూ, ఇంజనీరింగ్, అకౌంటింగ్ అధికారుల చుట్టూ రోజు తిరుగుతున్నారు. ఎవరూ స్పందించక పోవడంతో చివరకు ఇక నుంచి ఎలాంటి పనులు చేయరాదని గుత్తేదారుల సంఘం తీర్మానం చేసి చైర్‌పర్సన్, కమిషనర్‌కు వినతులు ఇచ్చి పనులు నిలిపివేశారు. దీంతో అధికారులు, పాలకులు వారితో మాట్లాడి పూర్తి భరోసా ఇవ్వడంతో గత నెల రోజులుగా పనులు జరిగాయి. అయితే ఈ నెల రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు ఈ నెల 15వ తేదికి ఈ ఆర్థిక సంవత్సరానికి సంబందించి బిల్లులు అప్‌లోడ్ చేయడానికి తుది గడువు విధిస్తు ఉత్తర్వులు విడుదల చేశారు. దీంతో అధికారులు ఇప్పటి వరకు పూర్తి అయిన పనులను సిఎఫ్‌ఎంఎస్‌లోకి ఎక్కించడానికి కుస్తీ పడుతున్నారు. బుధవారం చివరి రోజు కావడంతో సర్వర్ సరిగా పని చేయక పోవడంతో అన్ని బిల్లులు ఎక్కించలేక పోయారు. 15వ ఆర్థిక సంఘం నిధులు మున్సిపల్ ఖాతాలో ఉన్నా బిల్లులు పెట్టకపోవడంతో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది.

పనులు పూర్తి చేసి బిల్లుల కోసం ఎదురుచూపు

పట్టణంలోని కొట్నూరులోని ఇందిరమ్మకాలనీలో ఓ గుత్తేదారుడు రూ.40 లక్షలతో మురుగు కాలువ నిర్మాణం, రూ.40 లక్షలతో పైపులైన్ పనులు పూర్తి చేశాడు. ఇదే గుత్తేదారుడితో సింగిరెడ్డిపల్లిలో నీటి సమస్య ఉండటంతో అధికారులు యుద్ధప్రాతిపాదికన రూ.10 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణం, మోటార్ల ఏర్పాటు తదితర పనులు చేయించారు. అత్యవసరంగా చేసిన పనులకు బిల్లులు చేయలేదు. పనులు పూర్తి చేసినా, బిల్లులు మాత్రం సిఎస్‌ఎంఎస్ పోర్టర్‌లోకి చేరలేదు. మరో గుత్తేదారు 35వ వార్డులో రూ. 40 లక్షలతో ఒకటి, రూ.25 లక్షలతో మరొక మురుగు కాలువను నిర్మించాడు. బిల్లులు మంజూరు కాకపోవడంతో లబోదిబోమంటున్నాడు. పట్టణంలో మురుగు నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 3 కోట్లతో మురుగు కాలువలు నిర్మించారు. ఇవేవీ ఆన్‌లైన్ కాలేదు. మున్సిపల్ సాధారణ నిధులతో రూ.లక్ష, రెండు లక్షలు, 5 లక్షల అభివృద్ధి పనులు దాదాపు రూ.2 కోట్ల విలువైనవి చేశారు. వాటికి అతీగతి లేదు. సిఎఫ్‌ఎంఎస్ పని చేయడం లేదని, గుత్తేదారులు చేసిన పనులను అధికారులు రికార్డు చేయడం లేదు. వాటిని ఎం-బుక్ లోకి ఎక్కించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని గుత్తేదారులు వాపోతున్నారు. వీటితో పాటు పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు సంబందించిన పనులకు సంబందించిన బిల్లులు సైతం ఇంత వరకు మంజూరు కాలేదు. పట్టణంలోని నూతనంగా తహశీల్దార్ కార్యాలయం నిర్మాణం చేసి సంవత్సరం గడుస్తున్న బిల్లులు మంజూరు కాక పోవడంతో గుత్తేదారులు దానిని అధికారులకు అప్పగించ లేదు. గత ప్రభుత్వం హయాంలో ఎంజిఎం మైదానంలో బాలకృష్ణ ప్రారంభించిన ఇండోర్ స్టేడియం పనులకు సైతం బిల్లులు మంజూరు కాక ఆగిపోయాయి. ఇలా గుత్తేదారులు పనులు పూర్తి చేసి బిల్లుల కోసం ఎదురుస్తున్నారు.

ముగిసిన గడువు

2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబందించి జరిగిన అభివృద్ధి పనులకు సంబందించి ఫిబ్రవరి 15వ తేది లోపు సిఎఫ్‌ఎంఎస్‌లోకి ఎక్కించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు లేఖ నెంబరు 273తో ఉత్తర్వులు జారీ చేసింది. పురపాలక సంఘాల్లో నిధులు మూలుగుతున్నా గత 6 నెలలుగా ఆర కొర బిల్లులు మంజూరు చేసి చేతులు దులుపుకున్నారు. అభివృద్ధి పనులు జరిగి, వచ్చిన నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి పురపాలక సంఘాల్లో ఏర్పడింది.

ఆర్టీసీ స్థలాల లీజుపై అవగాహన

కదిరి టౌన్ : కదిరి బస్టాండు, డిపోలోని ఖాళీ స్థలాలకు 33 ఏళ్ళ పాటు లీజుపై వ్యాపారము నిర్వహించుకుని, ప్రయాణికులకు అనువైన సౌకర్యాల కల్పనపై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో గురువారం స్థానికడిపో మేనేజరు కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లుకదిరి డిపో మేనేజరు బి.మైనోద్దీన్ తెలిపారు. ఈ జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ ఈ సమావేశంలో పాల్గొని సలహాలు, సూచనలు ఇవ్వనున్నారన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని పెడపల్లి గ్రామంలో సేవాలాల్ మహారాజ్ 284వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన న్యూ లైఫ్ లోడింగ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మారెమ్మ గుడి ఆవరణంలో సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతోత్సవాలను నిర్వహించారు. అనంతరం గ్రామంలో సేవాలాల్ చిత్రపటాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు, పెడపల్లి సర్పంచి మంగ్లీ బాయ్, మాజీ సర్పంచి శ్రీరామ్ నాయక్, బండ్ల మోహన్ నాయక్, శ్రీనివాస నాయక్, రాందాస్ నాయక్, రవి నాయక్, ఎంపీటీసీ సరస్వతి బాయ్, చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

నల్లమాడ : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎపిటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. పెండింగ్ డిఎలను మంజూరు చేయాలన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ దేవేందర్ నాయక్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్, జిల్లా, మండల నాయకులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ బ్రోచర్లు విడుదల

హిందూపురం : పట్టణంలో గురునాథ్ సర్కిల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవారాయల విగ్రహ ఆవిష్కరణ గురువారం నిర్వహిస్తున్నామనిఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున బలిజలు పాల్గొని విజయవంతం చేయాలని బలిజ సంఘం నాయకులు కోరారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి, విగ్రహావిష్కరణకు సంబందించిన వివరాలను వెల్లడించారు. అనంతరం బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సమావేశంలో రాయల్ గోపాల్, వెంకటరాముడు, నారాయణ, నాగరాజు, గిరీష్‌కుమార్, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదుతో ప్రయోజనాలు

బుక్కపట్నం : పంట నమోదుతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఎడిఎ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని అగ్రహారం గ్రామంలోని రైతుల పొలాల్లో నిర్వహించిన పొలంబడిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదు ద్వారా రైతుల అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సతీష్ బాబు, ఎఇఒ సుధాలక్ష్మి, వీఆర్వో హరి, రైతు భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

నల్లచెరువు : స్థానిక పోలీస్ స్టేషన్‌ను కదిరి డిఎస్‌పి భవ్య కిషోర్ బుధవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ స్టేషన్ లోని కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐ శివ శంకర్ నాయక్, ఎస్ఐ వరలక్ష్మి, పోలీసులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

రొద్దం : మాజీ ఎంపిపి, టిడిపి నాయకురాలు అంజనమ్మ తండ్రి దుద్దేబండ నారాయణప్ప బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా అధ్యక్షులు పార్థసారథి, పార్లమెంట్ అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ తదితరులు మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు

ఆత్మకూరు : రైతు భరోసా కేంద్రాల ద్వారా రబీలో సాగు చేసిన పంటలను కొనుగోలు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్‌బికెలో సహాయకులతో సమీక్ష నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పప్పుశెనగ పంటకు మద్దతు ధర ఇచ్చి ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కావున రైతులందరూ తప్పనిసరిగా ఆర్‌బికెల్లో ఏ పంట వేస్తున్నారో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పప్పుశనగకు కనీస మద్దతు ధర క్వింటాకు రూ.5,335 నిర్ణయించినట్లు తెలిపారు. అయితే ఈ- పంట నమోదు, ఇకెవైసి చేయించుకున్న వారి పంటలను మాత్రమే కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా ఈ- పంట నమోదు, ఇకెవైసి చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు కూడా వర్తిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒలు విజయ్‌కుమార్, సుజిత, విఎఎ, విహెచ్ఎ, ఇఎస్ఎ, ఎంపిఇఒలు, రైతులు పాల్గొన్నారు.

యోగాసన క్యాలెండర్లు ఆవిష్కరణ

గుత్తి : స్థానిక ఎంఇఒ కార్యాలయంలో మండల విద్యాధికారి బి.రవినాయక్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ చిల్డ్రన్స్ యోగాసన క్యాలెండర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్‌కె యోగా కేంద్రం నిర్వాహకులు రామకృష్ణారావు, కృష్ణ మాట్లాడుతూ బెంగళూరులోని సరళ యోగావేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిల్డ్రన్స్ యోగాసనా క్యాలెండర్లను ముద్రించారన్నారు. ఇందులో 18 దేశాలు చెందిన విద్యార్థులు పోటీ పడగా గుత్తిలోని ఆర్‌కె యోగా కేంద్రం విద్యార్థులు ఖ్యాతిరెడ్డి, ప్రవీణ్‌ప్రసాద్ ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థుల యోగాసనాల చిత్రాలను క్యాలెండర్లలో ముద్రించినట్లు తెలిపారు.

ఉచిత గుండె వైద్యశిబిరం

రాయదుర్గం : రాయదుర్గంలోని రాజీవ్‌గాంధీ కాలనీ వద్ద ఉన్న కింగ్ ఆఫ్ శాలెం క్రైస్ట్ చర్చి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత గుండె వైద్యచికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో అనంతపురంలోని కిమ్స్ సమీరా ఆసుపత్రికి చెందిన వైద్యులు శ్రీనివాసులు దదాదాపు 200 మంది రోగులకు వైద్యులు ఈసీజీ , 2డి ఎకో, బిపి, షుగర్ మొదలైన వైద్య పరీక్షించారు. అనంతరం అవసరమైన రోగులకు అనంతపురంలోని కిమ్స్ సవేరా ఆసుపత్రిలో మెరుగైన చికిత్సను అందించనున్నట్లు పాస్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు గోపీచంద్, రాజశేఖర్, మురళి. తదితరులు పాల్గొన్నారు.

చింతఫల సాయానికి వేలంపాట

రాయదుర్గం : కళ్యాణదుర్గం డివిజనల్ పంచాయతీ అధికారి, పంచాయతీ విస్తరణ అధికారి ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని పల్లేపల్లి ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో మల్లాపురం గ్రామపంచాయతీ పరిధిలోని చింతచెట్ల ఫలసాయానికి వేలంపాట నిర్వహించారు. ఇందులో ఐదుగురు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనగా రూ.11,000కు పల్లేపల్లికి చెందిన వెంకటేశులు హక్కులు దక్కించుకున్నారు.

ఉచిత పశువైద్యశిబిరం

నార్పల : మండల కేంద్రంలోని పశువైద్యశాలలో బుధవారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో 35 ఎదకు రాని, చూలు నిలవని పశువులను పరీక్షలు చేసి తగిన వైద్యం చేశారు. ఈ సందర్భంగా స్థానిక పశువైద్యాధికారి గోవిందరాజు మాట్లాడుతూ పశు విజ్ఞాన బడి ఏర్పాటు చసి ఏడాదికి ఒక దూడ ఎలా తీసుకోవాలనే విషయాన్ని వివరించారు. రైతులకు అవసరమైతే తమ వైద్యశాలలో వెయ్యి దూడల వీర్యం అందుబాటులో ఉందన్నారు. రూ.500తో ఎద సూదులు వేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పశుగణాభివృద్ధి ఉపసంచాలకులు సుధాకర్, అనంతపురం ఉప సంచాలకులు డాక్టర్ రమేష్‌రెడ్డి, పశుగణాభివృద్ధి సంస్థ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

రసాభాసగా మండల మీట్

అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యురాలు

చిలమత్తూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రాసాబాసగా కొనసాగించింది. ఈసందర్భంగా మండల అభివృద్ధి అధికారిపై కోడూరు పంచాయతీకి చెందిన ఇద్దరు ఎంపిటీసిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ అనుమతి లేకుండా మధురేపల్లి రోడ్డు కు గ్రావెల్ ఎలా వేశారని ప్రశ్నించారు. ఆ వర్క్ పై సమావేశంలో ఎలాంటి చర్చా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచి, కోడూరు పంచాయతీ కి చెందిన ఎంపిటీసి, వైస్ ఎంపిపి నిర్ణయం మేరకు చర్చించి పనిని పెట్టామని ఎంపిడిఒ సమాధానం ఇచ్చారు. వైస్ ఎంపిపి అంజలీదేవి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులుగా ఉన్న తమకు మండల పరిషత్ నిధులు వినియోగించుకునే హక్కులేదా అని ప్రశ్నించారు. మరో వైస్ ఎంపిపి బయన్న సైతం గతంలో కూడా సమావేశంలో ఎలాంటి చర్చా లేకుండా అనేక పనులు చేశారు. వాటిని క్యాన్సిల్ చేస్తే దీనిని కూడా క్యాన్సిల్ చేసుకుంటామని అన్నారు. దీంతో కాసేపు సమావేశం రచ్చరచ్చగా మారింది. చివరిగా తహశీల్దార్ నాగరాజు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల నేపథ్యంలో రాజకీయనాయకులు ప్రచారాలకు సంబంధించిన పోస్టర్లు బ్యానర్లు తొలిగించాలని, నిబందనలు ఉల్లంగిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి పురుషోత్తం రెడ్డి, జెడ్పిటీసీ అనుషాతో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపిపి జగన్మోహన్ ఎంపీడీవో డి అంజనప్పను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీపీ జగన్మోహన్ మాట్లాడుతూ. 90 రోజులకు ఒక్కసారి నిర్వహించే మండల సమావేశానికి హాజరుకాకపోతే సభ్యులు వారి గ్రామాల సమస్యలను ఎవరితో చెప్పుకోవాలని ప్రశ్నించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సర్పంచులు సుధాకర్, శివప్ప నాయుడు, అనసూయమ్మ తదితరులు మాట్లాడుతూ మూడు సంవత్సరాలైనా పంచాయతీ నిధులు రాకపోవటంతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించలేకపోతున్నామన్నారు. ఈ సమావేశంలో. జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎస్ ఫయాజ్ అలీ, వైస్ ఎంపీపీలు గంగోజమ్మ, భారతి, తహశీల్దార్ రవితో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి బుక్కపట్నం

జగనన్న ప్రవేశపెట్టిన గోరుముద్దకు సాయి సెంట్రల్ ట్రస్టు ద్వారా ప్రభుత్వానికి సేవలు అందిస్తున్న ట్రస్టు సేవలు అభినందనీయమని మేజర్ పంచాయతీ సర్పంచి నాగలక్ష్మి రాజు అన్నారు. ఈ మేరకు ఆమె బుధవారం సత్య సాయి మేనేజింగ్ ట్రస్టి ఆర్జే రత్నాకర్‌ను మర్యాదపూర్వం కలిసి సన్మానించారు సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి ట్రస్టు సేవలు అభినందనీయమన్నారు. గోరుముద్దకు రాష్ట్రవ్యాప్తంగా చేయూతనందిస్తున్న సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ దేశంతో పాటు రాష్ట్రంలో విద్యాసంస్థల., హాస్పిటల్స్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా బుక్కపట్నం గ్రామపంచాయతీ అభివృద్ధికి ట్రస్టు ద్వారా సహాయ సహకారాలు అందించాలని ఆర్జే రత్నాకర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బిల్డర్ వెంకటేష్. రాజు, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

రత్నాకర్‌ను సన్మానిస్తున్న సర్పంచి, తదితరులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరం మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ సమస్యలను పరిష్కరించాలని సిఐటియు మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎల్.ఆదినారాయణ, అయాబ్ ఖాన్ డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో నిత్యం వెట్టిచాకిరి చేయిస్తున్నారే తప్ప వారి సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. 2022 జూలైలో ఇచ్చిన హామీలను అమలు పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరిని వీడాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమంలో పారిశుధ్య, అవుట్‌సోర్సింగ్, ఇంజనీరింగ్ కార్మికులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈసమావేశంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లిపెద్దన్న, సిఐటియు జిల్లా నాయకులు ఎస్‌హెచ్ బాషా , పారిశుధ్య కార్మికసంఘం అధ్యక్షుడు ఎం బాబు పాల్గొన్నారు.

గిరిజన యువతలో మార్పురావాలి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

గిరిజన విద్యార్థులు, యువతలో మార్పు రావాలని విద్యలో రాణించాలని సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ పిలుపునిచ్చారు. మునిసిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి తండాలో రూ. 25 లక్షల వ్యయంతో ట్రస్టు చేయూతనిచ్చి నిర్మించిన మారెమ్మ దేవాలయంలో బుధవారం జరుగుతున్న విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ ఇప్పటికే గిరిజనులలో గణనీయమైన మార్పులు వచ్చాయని వారి జీవన శైలిలో మరింత మార్పు రావాలని అందుకు యువత ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వ సేవలను అందిపుచ్చుకోవాలన్నారు. ప్రతి ఏటా రూ. 45 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా 38 లక్షల విద్యార్థులకు ప్రతి రోజు రాగి మాల్ట్‌ను అందించడానికి ట్రస్టు ముందుకు వచ్చిందన్నారు. దశలవారీగా మరిన్ని సేవలు అందించడానికి ట్రస్టు కృషి చేస్తుందన్నారు. జిల్లాలో పురాతన దేవాలయాల పునరుద్ధరణకు ట్రస్టు సహకారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, నాయకులు మాధవరెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆర్‌జె. రత్నాకర్

మహిళలపై దాడుల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

విలేకరుల సమావేశంలో పాల్గొన్న తెలుగు మహిళలు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయుత్యాలను అడ్డుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని తెలుగు మహిళా రాష్ట్ర ప్రధానకార్యదర్శి సాహెబ్బీ, నియోజకవర్గ అధ్యక్షురాలు ముత్తుకూరు బీబీ ఆరోపించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహిళలపై రోజురోజుకు దాడులు, అఘాయిత్యాలు జరుగుతున్న ప్రభుత్వం ఏమీ చేయలేని నిస్సాహాయస్థితిలో ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. మద్యం, గంజాయి, పోర్నోవెబ్ సైట్స్ మహిళలపై హింసను ప్రేరేపించే విధంగా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి నివాసానికి కూతవేటు దూరంలో ఉన్న ఎన్టీఆర్ కట్ట వద్ద అంధ బాలికను చంపడం దారుణమన్నారు. ఇకనైనా ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు స్వర్ణకుమారి, చౌడమ్మ, మీనాక్షి, ప్యారీమా, వెంకటలక్ష్మి, జయలక్ష్మీ, సుగుణ, యశోద, మాలతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శిగా మంజుల నరేంద్ర

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శిగా ధర్మవరానికి చెందిన మంజుల నరేంద్ర ఎన్నికయ్యారు. బుధవారం పట్టణంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నరేష్ ఎనుముల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంజుల నరేంద్రను రాష్ట్ర కారదర్శిగా ఎన్నుకుని నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంజుల నరేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యరంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు సాగిస్తానని మంజుల నరేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ ధర్మవరం ఇన్‌ఛార్జి రంగన అశ్వర్థనారాయణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రసాద్, పట్టణ అధ్యక్షులు చైతన్య, నాయకులు సురేష్, గణేష్, గిరీష్, వేణు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో 25 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని రహమత్‌పురం, సిపిఐ కాలనీలో ఎంఐఎం పార్టీలో ఉన్న 25 కుటుంబాలు 16వ వార్డు ఇన్‌చార్జ్ సలీం ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. బుధవారం ఎమ్మెల్సీ నివాసం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇక్బాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ తదితరులు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో షబ్బీర్, నయాజ్, రియాజ్, అమోజ్, రిజ్వాన్, అస్లాం, బాదుల్ల, జబీవుల్ల, సద్దాం, రియాజ్, సనావుల్ల, అజ్జు, సనావుల్లా, అక్రమ్ తదితరులతో పాటు కౌన్సిలర్ అయూబ్, కో ఆప్షన్ మెంబర్ రహమత్, వైసీపీ నాయకులు లతీఫ్ సెట్, మార్కెట్ చాందు, సోమశేఖర్ రెడ్డి, మన్సూర్, నస్రు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలోకి చేరిన వారితో ఎమ్మెల్సీ, చైర్‌పర్సన్

నేరాలు ఘోరాలు

సీసీ ఫుటేజీలో కన్పిస్తున్న చోరీ దృశ్యం

రూ. లక్ష నగదు అపహరణ

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణంలో బుధవారం స్కూటిలో పెట్టిన రూ. లక్ష నగదును దొంగలు అపహరించారు. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని బస్టాండ్ సమీపంలోనున్న హెచ్‌డిఎఫ్ బ్యాంకులో హౌసింగ్ లోను కట్టేందుకు లోనికోటకు చెందిన అమన్ అనే వ్యక్తి తన స్కూటీ డిక్కీలో రూ.లక్ష నగదు పెట్టుకుని బ్యాంకుకు వచ్చాడు. డబ్బు తీసుకోకుండా అమన్ బ్యాంకులోకి వెళ్లిపోయాడు. ఇది గమనించిన దొంగలు స్కూటీ డిక్కీని ఓపెన్ చేసి అందులోని రూ. లక్ష నగదును ఎత్తుకెళ్లారు. అక్కడే ఉన్న సీసీ కెమెరాలో దొంగతనం చేసే వీడియో రికార్డు అయింది. బాధితుని ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగతనం చేస్తున్నది మొత్తం బ్యాంకు కింద ఉన్న ఎంఆర్ఎఫ్ టైర్ల షాపులోనున్న సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఎంఆర్ఎఫ్ టైర్ల షాపులోని సీసీ కెమెరా పుటేజీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దొంగల కోసం గాలిస్తున్నారు.

గొర్రెల వ్యాపారం పేరుతో రూ. 30 లక్షలు టోకరా

పుట్లూరు : మండలంలోని మడ్డిపల్లి గ్రామానికి చెందిన నారపరెడ్డి పొట్టేళ్ల వ్యాపారం చేస్తూ దాదాపు రూ.30లక్షలు ఎగ్గొట్టేందుకు సిద్ధమయ్యారని ఆరోపిస్తూ పలువురు బాధితులు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపిన వివరాల మేరకు... మడ్డిపల్లికి చెందిన నారపరెడ్డి మండలంలోని చింతకుంట, కందికాపుల, నారాయనపల్లి, తురకవానిపల్లి, గరుగుచింతలపల్లి, పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట గ్రామాల్లోని గొర్రెల కాపరుల నుంచి పొట్టేళ్లు, గొర్రెల కాపురుల నుంచి అప్పుకు కొనుగోలు చేసేవాడు. ఇందులో భాగంగా పలువురు కాపరుల నుంచి దాదాపు రూ.30లక్షలు విలువజేసే గొర్రెలను కొనుగోలు చేసి తప్పించుకుని తిరుగుతున్నాడని బాధితులు వాపోయారన్నారు. ఇంటి వద్దకు వెళ్తే తాళం వేసి ఉందని, సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండటంతో దిక్కుతోచక బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రచార కరపత్రాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, తదితరులు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి-ఉరవకొండ

బడుగు, బలహీన వర్గాలు, ప్రజా గొంతుకులైన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. పశ్చిమ రాయసీమ పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కత్తి నరసింహారెడ్డికి మద్దతుగా సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డితో బుధవారం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా తహశీల్దార్, ఎంపిడిఒ, హౌసింగ్, హౌసింగ్, అగ్రికల్చర్, ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్, ఉపాధి హామీ, ఐసిడిఎస్ తదితర ప్రభుత్వ కార్యాలయాలతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్, ప్రయివేట్ పాఠశాలల్లో పర్యటించి పిడిఎఫ్ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యత ఓటును వేయాలని అభ్యర్థించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రజాసేవ చేయడానికి తమ ఉద్యోగాలను సహితం వదిలేసి ముందుకొచ్చిన మంచి వ్యక్తులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డి అన్నారు. అలాంటి వారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే అన్నివర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం పాటుపడతారన్నారు. ప్రస్తుతం అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, నిరుద్యోగులను ప్రలోభాలకు గురి చేసే విధంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను పక్కనపెట్టి ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న ప్రభుత్వం మెడలు వంచే విధంగా ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అలాగే ఈనెల 22వ తేదీన అనంతపురంలో జరిగే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్‌కు భారీఎత్తున ప్రజా సంఘాల నాయకులు. కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గుంతకల్లు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు, వత్తిదారుల జిల్లా నాయకులు బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ప్రయివేటు, ప్రభుత్వ కళాశాలల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ ఉపాధ్యాయ, నిరుద్యోగ ప్రజా సమస్యలపై చట్టసభల్లో గొంతు వినిపించాలంటే పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పౌరుల సంఘం నాయకులు మారుతీప్రసాద్, డివైఎఫ్ఐ నాయకులు చరణ్, ఆవాజ్ నాయకులు అబ్దుల్లా, ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకీ, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్పోర్ట్స్ మీట్

అనంతపురం : స్థానిక రుద్రంపేట బైపాస్ శ్రీచైతన్య పాఠశాల ఎటిపి-10 బ్రాంచిలో ప్రీ ప్రైమరీ స్పోర్ట్స్ మీట్ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎజిఎం సుబ్బారెడ్డి జెండా ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు వివిధ రకాల క్రీడల గురించి వివరించడంలో భాగంగానే స్పోర్ట్స్ మీట్ నిర్వహించినట్లు తెలిపారు. అంతేగాకుండా క్రీడల ద్వారా విద్యార్థులకు మానసిక, శారీరక దారుఢ్యం లభిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లతోపాటు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, డీన్ సతీష్, ప్రైమరీ ఇన్‌ఛార్జి సరిత, జోనల్ పిఇటి విజయ్‌కృష్ణ, పిఇటి శివప్రసాద్, డాన్స్ మాస్టర్ విష్ణు, డ్రాయింగ్ మాస్టర్ మధుకర్, ప్రీ ప్రైమరీ టీచర్లు శైలజ, ఝాన్సీ, ఉమాదేవి, చైతన్య, ఉపాధ్యాయుల బందం పాల్గొన్నారు.

ఎస్ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

అదనపు ఎఎస్పీ ఇ.నాగేంద్రుడు

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి ఆదేశాల మేరకు ఈనెల 19న నిర్వహించనున్న ఎస్ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించాలని అదనపు ఎఎస్పీ ఇ.నాగేంద్రుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అనంతపురం సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, సిఐలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాల సమన్వయంతో ఎస్ఐ అభ్యర్థులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పరీక్ష కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద తప్పక సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులు కూడా నిర్ణీత సమయంలోగా హాజరుకావాలని కోరారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర డిజిటల్ పరికరాలు అనుమతించమన్నారు. ప్రతి సెంటర్‌లో పోలీసు సిబ్బందితో పాటు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ద్వారా పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో అనంతపురం డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి, ఎ.ఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, పలువురు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.